సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



దళితుల భూముల్లో బోర్డులు

పెద్దబమ్మిడి దళితులు ఆందోళన చెందుతున్నారు. వారి భూముల్లో బోర్డులు కనిపిస్తున్నాయి. - 8లో



నైపుణ్య శిక్షణ..

నైపుణ్య శిక్షణ భవిష్యత్‌కు భరోసా ఇస్తోంది. యువత వినియోగించుకుంటున్నారు. - 8లో

మూలపేట పోర్టు పరిశీలన

సంతబొమ్మాళి: మూలపేట పోర్టును రాష్ట్ర రవాణా రహదారులు, భవనాల శాఖ అధికారి కృష్ణబాబు శనివారం సాయంత్రం పరిశీలించారు. పోర్టులో పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కొద్ది సేపటి తర్వాత తిరిగి ప్రయాణమయ్యారు. వీరితో పాటు పోర్టు సీఈఓ అభిషేక్ కుమార్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్‌డీఓ కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు. పోర్టు లోపలికి విలేకరులను అనుమతించలేదు.

న్యూస్‌రీల్

రెండు రోజులు తేలికపాటి వర్షాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రెండు రోజులు పాటు తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు రేపు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: కూటమి పాలనలో వెలుగులోకి వచ్చిన కల్తీ మద్యం కుంభకోణంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని, నిజాలు వెలుగులోకి తీసుకురావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో ఈ నెల 13న సోమవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీలో ఈ కల్తీ మద్యం కుంభకోణం దేశంలోనే అతి పెద్దదని అన్నారు. టీడీపీ నాయకులే దీనికి సూత్రధారులు, పాత్రధారులని విమర్శించారు. ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ఇళ్ల సమీపంలోనే నకిలీ మద్యం తయారీ జరుగుతోందని తెలిపారు. ఈ నెల 13న నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే ర్యాలీల్లో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'సమన్వయంతో మంచి ఫలితాలు సాధిస్తాం'

- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మహేష్‌బాబు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో క్రీడలతో మమేకమైన ప్రతి ఒక్కరితో సమన్వయం చేసుకుంటూ మంచి ఫలితాలు సాధిస్తామని నూతన జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.మహేష్ బాబు పేర్కొన్నారు. జిల్లా నూతన డీఎస్‌డీఓగా మహేష్‌బాబును ప్రభుత్వం తాజాగా నియమించింది. ఈయన స్వస్థలం విజయవాడ. అంతకుముందు గుంటూరు, కృష్ణా జిల్లాలకు డీఎస్‌డీఓగా వ్యవహరించారు. అలాగే శాప్ హెడ్‌ఆఫీసులో శాప్ ఆఫీసర్‌గా నాలుగేళ్ల పని చేసి మెప్పించారు. ప్రస్తుతం విజయనగరం జిల్లా హాకీ కోచ్‌గా పనిచేస్తున్న మహేష్‌బాబు హెడ్‌ఆఫీసులో ఆర్డర్ కాపీ తీసుకుని.. మరో మూడు నాలుగు రోజుల్లో ఇక్కడ డీఎస్‌డీఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, అన్ని క్రీడాంశాల్లో అమోఘంగా రాణిస్తు అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నారని చెప్పారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, పీడీ–పీఈటీ అసోసియేషన్, క్రీడాసంఘాలు, డీఎస్ఏ కోచ్‌లు అందరితో కలిసి సమష్టిగా ముందుకు వెళ్తామని తెలిపారు. జిల్లాలో క్రీడా వసతులు, సౌకర్యాలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు నివేదించి వాటి కల్పన, సమకూర్చడంపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తానని మహేష్ బాబు పేర్కొన్నారు. హాకీ కోచ్‌గా మహేష్ బాబు ఎన్నో ఘనతలు సాధించారు. శ్రీకాకుళం జిల్లా డీఎస్‌డీఓగా పనిచేస్తున్న డాక్టర్ కల్లేపల్లి శ్రీధర్‌రావు మన్యం పార్వతీపురం జిల్లా డీఎస్‌డీఓగా బదిలీ అయ్యారు.

శ్రీముఖలింగంలో గౌరమ్మ ఉత్సవాలు



జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో గౌరమ్మ, నందెన్న ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ అనంతరం బిందె దీపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ పూజలు నిర్వహించారు. పగటి వేషాలు, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.



ఇచ్ఛాపురం రూరల్: కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



ఆమదాలవలసలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ తదితరులు



పలాస: మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు

కోటి సంతకాల యాగం

కోటి సంతకాల యాగాన్ని వైఎస్సార్ సీపీ కొనసాగిస్తోంది. మెడికల్ కాలేజీలు ప్రైవేటుకు అప్పగించడానికి చూస్తున్న ప్రభుత్వ వైఖరిని దునుమాడుతూ ప్రజలతో కలిసి నిరసనలు కొనసాగిస్తోంది. సర్కారు మెడలు వంచి పేదలకు వైద్య విద్య చేరువ చేసే వరకు పోరాటం ఆగదని నాయకులు చెబుతున్నారు. –సాక్షి నెట్‌వర్క్

ఉద్యమం తీవ్రతరం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తాం. మెడికల్ కాలేజీలు ప్రైవేటుకు అప్పగించాలన్న ఆలోచన సరి కాదు. దీని కోసం కోటి సంతకాలు సేకరిస్తాం.

– సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

కళకలం

- శ్రీకూర్మనాథాలయంలో రూపు కోల్పోతున్న విశిష్ట చిత్రకళా సంపద
- 42 కుడ్య చిత్రాల పరిరక్షణపై లేఖ రాసినా స్పందించని వైనం
- దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి చెప్పినా ముందుకు కదలని పరిశీలన



కళావిహీనంగా కనిపిస్తున్న శేషపాన్పుపై ఉన్న విష్ణుమూర్తి కుడ్య చిత్రం

గార: ప్రఖ్యాత వైష్ణవ క్షేత్రం శ్రీకూర్మంలోని అపురూప చిత్రకళా సంపద అవసాన దశకు చేరుకుంటోంది. ఇక్కడి అరుదైన కుడ్య చిత్రాలు రానురాను రూపు కోల్పోతున్నాయి. 15 ఏళ్ల కిందట గోడలకు రంగులు వేసే సమయంలో సున్నపు పూతను తూర్పు గోడలపై వేసేశారు. దీంతో సుమారు 18 చిత్రాలు పది శాతం కూడా కనిపించని పరిస్థితి ఉంది. మరికొన్ని చిత్రాలపై దీపపు పొగ, తెలుపు రంగు పడి ఉంది. గోడపై సున్నపు పూత పెచ్చులూడి పడిపోతున్నాయి. ఎంతో విశిష్టత కలిగిన ఈ కుడ్య చిత్రాలు రూపుకోల్పోతున్నా అధికారులు స్పందించడం లేదు. ఇటీవల ఆలయానికి వచ్చిన గోవా గవర్నర్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పూసపాటి అశోకగజపతి రాజు కుడ్య చిత్రాలు కాపాడుకోవాల్సి ఉందని, పూర్వీకుల నైపుణ్యాన్ని భావితరాలకు అందించాల్సి ఉందని తెలిపారు. జూలై 25వ తేదీ వచ్చిన దేవదాయ ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తన పర్యటనలో చిత్రాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని, ఆర్కియాలజీ సాంకేతిక బృందం త్వరలో వస్తుందని తెలిపారు. ఆలయాన్ని దేవదాయ శాఖ పర్యవేక్షిస్తున్నా, రాష్ట్ర ఆర్కియాలజీ మాన్యుమెంట్ (రక్షిత కట్టడం)గా గుర్తింపు ఉండటంతో ఆ శాఖ అనుమతి తప్పనిసరై ఉంది.



దీపపు పొగ ద్వారా పాడయిన చిత్రం



పెచ్చులూడిపోయిన ఒక కుడ్య చిత్రం

16వ శతాబ్దానివి..

శ్రీకూర్మనాథాలయంలో 16, 17వ శతాబ్దాల్లో అప్పటి చిత్రకళా నిపుణులు ఈ చిత్రాలు వేసినట్టు చరిత్రకారుల అంచనా. బేడా మంటపంలోని దక్షిణ గోడకు ఉన్న చిత్రాలను దర్శించవచ్చు. చాలా చిత్రాలు రూపుకోల్పోయి పోల్చుకోలేని స్థితిలో ఉన్నాయి. విశిష్టమైన పురాతన కాలంనాటి కుడ్య చిత్రాలు (ఆకుపసర చిత్రాలు) కళావిహీనంగా తయారవుతున్నాయి. ఏటా చిత్రాలు స్పష్టత కోల్పోతూ వస్తున్నాయి. ప్రతి చిత్రం కింద భాగంలో వాటి ప్రాముఖ్యతను తెలిపే బోర్డులు కూడా ఏర్పాటు చేస్తే భక్తులు సులువుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. అలాకాకపోతే భక్తులు సాధారణ చిత్రాలుగానే భావిస్తారు రూపు రేఖలు కోల్పోయిన చిత్రాలు గుర్తించేందుకు కాకినాడకు చెందిన మంచెం సుబ్రహ్మణ్యేశ్వరరావు దాదాపు మూడేళ్ల పాటు దీనిపై పరిశోధన చేసి, కొన్ని చిత్రాలు పునః సృష్టి చేసి పుస్తకం రూపంలో తయారు చేశారు. ఈ పుస్తకావిష్కరణ సభలో స్థానిక ఎమ్మెల్యే కూడా కుడ్య చిత్రాలు పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ దిశగా పనులేవీ చేపట్టలేదు. పూర్వీకుల కళాకారుల సృజనాత్మకతను భావితరాలకు అందించడం బాధ్యతగా తీసుకొని, వీటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని చరిత్రకారులు, చిత్ర కళా ప్రేమికులు, భక్తులు కోరుతున్నారు.

ఆర్కియాలజీకి లేఖ రాశాం



దేవదాయ శాఖ మంత్రి పర్యటనలో ఆర్కియాలజీ నిపుణులతో ఫోన్‌లో మాట్లాడటంతో పాటు లేఖ రాయాలని ఆదేశాలివ్వడం జరిగింది. ఇప్పటికే లేఖ పంపించాము. త్వరలోనే రాష్ట్ర ఆర్కియాలజీ నిపుణులు ఆలయాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు.

– కె.నరసింహనాయుడు, ఈఓ, శ్రీకూర్మనాథాలయం

కుడ్య చిత్రాలు పురాతన సంపద



శ్రీకూర్మనాథాలయంలోని కుడ్య చిత్రాలు అపురూపమైన పురాతన సంపద. అప్పటి చరిత్రకారులు సృజనాత్మకత, నైపుణ్యంతో పలు చిత్రాలను వేశారు. వీటిని భావితరాలకు అందించే పని ప్రభుత్వం చేపట్టాలి.

– మంచెం సుబ్రహ్మణ్యేశ్వరరావు, కుడ్య చిత్రాల పరిశోధకుడు, కాకినాడ

ఆస్పత్రి వ్యవహారంపై డీసీహెచ్ విచారణ



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం గర్భిణి బంధువులు వైద్యునికి మధ్య జరిగిన వివాదంపై జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి కల్యాణ్ బాబు శనివారం విచారణ చేపట్టారు. గర్భిణితో పాటు సంబంధిత స్త్రీ వైద్య నిపుణురాలితో మాట్లాడి వారి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృషి మాట్లాడుతూ గర్భిణి తరపున వచ్చిన కొందరు దూషిస్తూ మాట్లాడారని వీడియో చూపించారు. దీంతో డీసీహెచ్ స్పందిస్తూ ఇలా దూషిస్తూ మాట్లాడడం సరికాదన్నారు. రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది బాధ్యతగా ఉండాలని సూచించారు. దీనిపై నివేదిక కలెక్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

శోక గీతిక

- అరుదైన వ్యాధితో అవస్థ పడుతున్న చిన్నారి
- ఆదుకోవాలని కుటుంబ సభ్యుల విన్నపం



చిన్నారి బేబీ గీతిక బెహరాను పరామర్శిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి తదితర నేతలు

కంచిలి: మండలంలోని కుంబరినౌగాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జగన్నాథ బెహరా చిన్న మనవరాలు మూడేళ్ల బేబీ గీతిక బెహరా అరుదైన వ్యాధితో బాధ పడుతోంది. అత్యంత అరుదైన ఈ వ్యాధి పుట్టినప్పుడే చిన్నారికి సంక్రమించింది. పాప ఆరోగ్యం నానాటికీ క్షీణిస్తుండడంతో వైజాగ్‌లో ఆస్పత్రుల్లో చూపించగా ఎస్ఎంఏ అనే వ్యాధిగా నిర్ధారించారు. ఇది పదివేల మంది పిల్లల్లో ఒకరికి మాత్రమే వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి నివా రణకు అతి ఖరీదైన ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. కోట్లలో ఖర్చు కావడంతో దాతలు స్పందించాలని జగన్నాథ్ బెహరా కోరుతున్నారు. పాప ఆరోగ్య ప్రస్తుత పరిస్థితి తెలుసుకునేందుకు స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మండల పార్టీ నేతలతో కలిసి శనివారం పరిశీలించారు. ఆరోగ్య వివరాలు తెలుసుకొని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు పార్టీ నేతలు దుర్గాసి ధర్మారావు, లడ్డుకేశవపాత్రో, కొణపల సురేష్, స్థానిక సర్పంచ్ హరిబంధు జన్ని, రంగాల శ్రీనివాస్‌లు ఉన్నారు.

విద్యుత్ స్తంభం నుంచి జారిపడి ఎలక్ట్రికల్ ఉద్యోగికి గాయాలు

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ ఎలక్ట్రికల్ ఉద్యోగిగా పనిచేస్తున్న గంగు మోహనరావు పాతిన వాని పేటలో వీధిలైట్లు వేస్తుండగా స్తంభం నుంచి జారిపడిపోవడంతో బలమైన గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరగ్గా బాధితుడిని గుట్టు చప్పుడు కాకుండా అధికారులు జెమ్స్‌కు తరలించారు. బాధితుడి తలకు గాయాలయ్యాయని, చేయి విరిగిందని, మున్సిపల్ అధికారులు ఒక రోజంతా పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ టి.రవి శనివారం సాయంత్రం జెమ్స్‌కు వెళ్లి పరామర్శించారు. విద్యుత్ సమస్యలపై వేళాపాళా లేకుండా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వాడుకుంటున్నారని, ప్రమాదం సంభవించినప్పుడు విడిచి పెడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేట.. ప్రకృతి ఆడిన ఆట





చిత్రం చూసి ఇదేదో చిన్న చెరువు అనుకునేరు. ఇది అచ్చంగా పంట పొలం. వారం రోజుల కిందట వంశధార వరదలకు పొలాలు ఇలా నీట మునిగిపోయాయి. ఇంకా వరద తగ్గలేదు. దీంతో మదనాపురం సమీపంలోని పంట పొలాల్లో మత్స్యకారులు ఇలా చేపల వేట సాగించారు. వరద తగ్గక పంట పూర్తిగా కుళ్లిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. – కొత్తూరు

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు నియామకం


పుక్కళ్ల గురయ్యనాయుడు


బెందాళం జయప్రకాష్


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పుక్కళ్ల గురయ్యనాయుడును నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి శనివారం ప్రకటన విడుదల చేశారు. పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండల కేంద్రానికి చెందిన ఈయన రెండుసార్లు సర్పంచ్‌గా, మండల పార్టీ అధ్యక్షుడిగా పని చేస్తూ వైఎస్సార్ వీరాభిమానిగా పార్టీలో విధేయతతో సేవలందిస్తున్నారు. గురయ్యనాయుడు నియామకం పట్ల నియోజకవర్గం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కవిటి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీగా ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలం డిగొనపపుట్టుగకు చెందిన బెందాళం జయప్రకాష్‌ను నియమిస్తూ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో మహిళా యాంకర్ మీనా ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..మీనా గత నెల 21న బీరువాలో భద్రపరిచిన బంగారు వస్తువులు చోరీకి గురవ్వడంతో ఈ నెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు చోరీకి పాల్పడినది సీపన్నాయుడుపేటకు చెందిన బెండి అజయ్‌గా గుర్తించారు. ఈయనపై గతంలోనూ పలు కేసులు నమోదయ్యాయి. అజయ్ నుంచి ఐదు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నైపుణ్య శిక్షణతో..
భవిష్యత్తుకు భరోసా


శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

- వివిధ ట్రేడుల్లో ఉచిత ట్రైనింగ్
- బ్యాచ్‌ల వారీగా హాజరవుతున్న యువత
- శిక్షణ అనంతరం మెరుగైన ఉపాధి

ఎచ్చెర్ల :

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎచ్చెర్లలో పలు రంగాల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో యువతకు పలు విభాగాల్లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. నెలకు రెండు ట్రేడులకు శిక్షణ చొప్పున ఏర్పాటుచేసి మెలకువలను నేర్పించడంతో పాటు ఉపాధి కల్పనకు చేయూతనందిస్తున్నారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, మొబైల్ సర్వీసింగ్, బ్యూటీపార్లర్, అల్లికలు, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ వంటి 18 ట్రేడుల్లో ఇక్కడ యువత శిక్షణ పొందుతున్నారు.

భవిష్యత్తుకు బాటలు..

డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చదివినా సరైన నైపుణ్యాలు లేకపోతే ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం లభించడం కష్టం. దీనిని గుర్తించిన అధికారులు నేటి యువతకు ఉద్యోగానికి అవసరమైయ్యే నైపుణ్యాలు పెంచుకునేందుకు వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఉన్నత చదువులు పూర్తి చేసిన వారితో పాటు ఇంటర్, డిగ్రీ, చదువుతున్న విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

30 రోజుల పాటు ట్రైనింగ్..

ప్రస్తుతం ఎచ్చెర్లలో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో ఫొటోగ్రఫీ, మొబైల్ రిపెయిరింగ్ విభాగంలో పలువురు యువత చేరి తమ నైపుణ్యాలకు పదును పెట్టుకుంటున్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుతున్న 60 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఉచిత వసతి, భోజన సౌకర్యాలతో 30 రోజుల పాటు శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ అనంతరం యూనియన్ బ్యాంక్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ క్షేత్రస్థాయిలో పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రాలను అందిస్తోంది. అవసరమైన వారికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారు. శిక్షణా కాలంలో కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, ఎంఎస్ ఆఫీస్, ఫొటోషాప్, పేజ్‌మేకర్, తెలుగు, ఇంగ్లిష్ టైప్‌రైటింగ్ వంటి అంశాలపైనా అవగాహన కల్పిస్తున్నారు.

బ్యాచ్‌ల వారీగా శిక్షణ..

బ్యాచ్‌కు 30 మంది చొప్పున నెలకు రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం ఫొటోగ్రఫీ, మొబైల్ సర్వీసింగ్ ట్రేడుల్లో శిక్షణ పొందుతున్నారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించడంతో పాటు సంబంధిత కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.

నమ్మకం పెరిగింది..



డిగ్రీ పూర్తి చేశాను. ప్రస్తుతం ఏ ఉద్యోగానికి వెళ్లినా కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని, నైపుణ్యత ఉండాలని అంటున్నారు. ఇక్కడ ఫొటోగ్రఫీతో కంప్యూటర్ పరిజ్ఞానం కల్పిస్తున్నారు. అన్ని అంశాలు అర్థమయ్యేలా నేర్పిస్తున్నారు. ఉద్యోగం సాధించగలననే నమ్మకం పెరిగింది.

– వి.మహేష్, శ్రీకాకుళం

శిక్షణ బాగుంది..



పీజీ చదివాను. కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు ఫొటోగ్రఫీలో మెలకువలు నేర్పిస్తున్నారు. మంచి నైపుణ్యం సాధిస్తే కెరీర్‌కు ఉపయోగంగా ఉంటుందని చేరాను. అన్ని అంశాలు బాగా నేర్పిస్తున్నారు. ఉపాధిలో స్థిరపడతాననే నమ్మకం కుదిరింది.

– సీహెచ్ చిరంజీవి, కొర్లకోట

సౌకర్యాలతో కూడిన శిక్షణ



ఇక్కడ విద్యార్థులకు అన్ని విధాలా సౌకర్యాలతో కూడిన శిక్షణ అందిస్తున్నాం. ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో కూడిన శిక్షణ అందిస్తున్నాం. శిక్షణ అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

– రామ్‌జీ, యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, ఎచ్చెర్ల

వారికి వరం..

వివిధ కారణాలతో చదువు మధ్యలోనే మానేసిన వారికి ఈ శిక్షణలు ఆపన్నహస్తంగా మారాయి. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ వరకూ చదువుకుని ఇంటి వద్ద పరిస్థితులు బాగా లేక చదువుకోని నిరుపేదలకు ఈ శిక్షణలు తోడుగా ఉంటున్నాయని చెబుతున్నారు. 18 ఏళ్లు నిండి పదో తరగతి వరకూ చదువుకున్న యువత అందరూ అర్హులే.

వీఆర్‌ఓల సంఘం కార్యవర్గ ఎన్నిక


ఎన్నికైన ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అడ్‌హాక్ అధ్యక్షుడిగా డి.రాజేష్ ఎన్నికయ్యారు. శనివారం శ్రీకాకుళంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన అంజనీకుమార్ (చంటి) అధ్యక్షతన వీఆర్‌ఓల సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులు (గ్రేడ్-1, 2, ప్రమోటీ, నామినీ) హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా డి.రాజేష్, సహాధ్యక్షుడిగా ప్రవీణ్, జనరల్ సెక్రటరీగా బి.రాంజీ, ట్రెజరర్‌గా జి.డిల్లేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎస్.అప్పలనాయుడు, పి.శ్రావణి, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.కొండలరావు, ధనలక్ష్మి, వెబ్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ సెక్రటరీగా మనోజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విశ్వనాథం, స్పోర్ట్సు అండ్ కల్చరల్ సెక్రటరీగా నాగరాజు, స్టేట్ ఈసీ సభ్యులుగా గణేష్ ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీఆర్‌ఎస్ఏ స్టేట్ సెక్రటరీ పి.శ్రీనివాస్, జిల్లా జనరల్ సెక్రటరీ బి.వి.వి.ఎన్.రాజు, ఏపీవీఆర్‌ఏ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ అనుపమ, అసోసియేట్ ప్రెసిడెంట్ బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిక్కోలు పుస్తక మహోత్సవానికి ఆహ్వానం


మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ డాక్టర్ కె.సుధీర్

శ్రీకాకుళం కల్చరల్: వచ్చే నెలలో జరగనున్న సిక్కోలు పుస్తక మహోత్సవానికి రచతయిలకు, అభిమానులకు ఆహ్వానం పలుకుతున్నామని కమిటీ చైర్మన్ డాక్టర్ కె.సుధీర్ కోరారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో సిక్కోలు పుస్తక మహోత్సవ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రదేశాల్లోనూ భారీ ఎత్తున పుస్తక ప్రదర్శనలు జరిగాయని, మన జిల్లాలో తొలిసారి నిర్వహిస్తుండటం శుభ పరిణామమన్నారు. కమిటీ కో–చైర్మన్ అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సాంస్కృతిక వేదికపై జిల్లా సంస్కృతిని ప్రతిబింబించే తప్పెటగుళ్ళు, జముకుల పాట, కోలాటం, పగటి వేషాలు, నాటికలు, డ్యాన్సులు, సంగీత ప్రదర్శనలు, ఏకపాత్రాభినయాలు తదితర ప్రదర్శనలు జరగనున్నాయని వివరించారు. విద్యార్థులతో సైన్స్‌ఫెయిర్ ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమిటీ కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలి వద్ద ఎన్‌టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో నవంబరు 11 నుంచి 20 వరకు జరిగే సిక్కోలు పుస్తక మహోత్సవం–2025, సాహిత్య, సాంస్కృతిక వైజ్ఞానిక సంబరాల్లో 100 ప్రచురణకర్తలు బుక్ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారని వివరించారు. సాహిత్య, సాంస్కృతిక, విజ్ఞాన ఆహార, మీడియా, ప్రచార, శానిటేషన్, సెక్యూరిటీ, ఆర్థిక సబ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో వివిధ ప్రజాసంఘాలు, సాహిత్య సంస్థల సభ్యులు కంచరాన భుజంగరావు, చీకటి దివాకర్, గొంటి గిరిధర్, పి.సుధాకర్, కొత్తకోట అప్పారావు, ఎల్.రామలింగస్వామి పాల్గొన్నారు.

రైల్లో ప్రయాణికుడికి అస్వస్థత


దిలీప్‌కుమార్‌ను 108లో తరలిస్తున్న సిబ్బంది

ఆమదాలవలస : రైల్వే ప్రయాణికుడికి ఛాతినొప్పి రావడంతో 108లో హుటాహుటిన చికిత్స అందించారు. శనివారం గుణుపూర్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న గుణుపూర్ పాసింజర్‌లో పర్లాకిమిడి సమీపంలోని కాశీపేటకు చెందిన ఎం.దిలీప్‌కుమార్ ప్రయాణిస్తున్నాడు. ఉర్లాం సమీపంలోకి వచ్చేసరికి ఛాతిలో నొప్పి వస్తుందని తోటి ప్రయాణిలకు చెప్పాడు. దీంతో వారు 108కు ఫోన్‌చేసి శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌కు రావాలని తెలియజేశారు. రైలు చేరుకునే సమయానికి 108 సిబ్బంది మూడో నంబర్ ప్లాట్‌ఫాం వద్దకు చేరుకొని బాధితునికి ప్రథమచికిత్స అందించారు. తీవ్రత ఎక్కువగా ఉండటంతో అదే అంబులెన్సులో శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఇంతలో దిలీప్‌కుమార్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు.

18న చెకుముకి సైన్స్ సంబరాలు


మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ గిరిధర్

శ్రీకాకుళం: చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని యూటీఎఫ్ భవనంలో చెకుముకి సైన్స్ సంబరాల కన్వీనర్ పి.కూర్మారావు అధ్యక్షతన పోస్టర్లు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు పాఠశాల స్థాయిలో అక్టోబర్ 18న, మండల స్థాయిలో నవంబర్ 1న, జిల్లా స్థాయిలో నవంబర్ 23న, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 12 నుంచి 14 తేదీల్లో జరుగుతాయని వివరించారు. విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, సైన్స్ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కామేశ్వరరావు, జి.వాసుదేవరావు, ఎస్.సాయి శ్రీనివాస్ శర్మ, యూటీఎఫ్ జిల్లా నాయకులు బి.శ్రీరామ్మూర్తి, పి.అప్పారావు, బి.ధనలక్ష్మి, ఎస్.స్వర్ణకుమారి, బి.మోహనరావు, ఎస్.సంజీవరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పద్యకవితల పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యువ రచయితల వేదిక అధ్యక్షురాలు తంగి ఎర్రమ్మ ఆధ్వర్యంలో జరిగిన నెలవారీ సమావేశంలో శనివారం పద్యకవితల పోటీలు ఉత్సాహంగా సాగాయి. బొంతు సూర్యనారాయణ, బోకర శ్రీనివాసరావు, రోణంకి విశ్వేశ్వరరావులు తొలి మూడు స్థానాల్లో నిలవగా.. రెడ్డి పద్మావతి, కుప్పిలి వెంకటరమణలకు కన్సోలేషన్ బహుమతులు లభించాయి. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జిల్లా ఎన్విరాన్‌మెంట్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, విశ్రాంత అధ్యాపకులు పిలకా శాంతమ్మ, డి.పార్వతీశం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం భాషాభివృద్ధిపై ఆర్.డిల్లీశ్వరరావు, ఆర్.విశ్వేశ్వరరావు, ఆర్.పద్మావతి, జి.గోపాలకృష్ణ, కె.జనార్దనరావు, డి.పార్వతీశం, డి.ఈశ్వరరావులు కవితల్ని వినిపించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.మాలతి, జి.సునీత, శివతేజ, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని అరసవల్లి సెగిడివీధికి చెందిన ఓ విద్యార్థి అదృశ్యమైనట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు. పాతబస్టాండ్‌లో పండ్ల దుకాణం నడుపుతున్న పొట్నూరు వెంకటరమణకు కుమార్తె, కుమారుడు సాయికృష్ణ (28) ఉన్నారు. సాయికృష్ణ ఇంటి వద్దనే ఉంటూ సివిల్స్‌కు ప్రిపేరయ్యేవాడు. ఈ ఏడాది జనవరి 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడో దూరంగా ఉంటూ చదువుకుంటాడని భావించి వెతకడం మానేశారు. నెలలు గడుస్తున్నా ఆచూకీ లేకపోవడంతో శనివారం రాత్రి విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

దళితుల భూముల్లో బోర్డులు


తమ భూముల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న పెద్దబమ్మిడి దళితులు

- ఆందోళనలో పెద్దబమ్మిడి దళితులు
- 2009 నుంచి అన్ని రకాల పత్రాలతో సాగు చేస్తున్నామని స్పష్టీకరణ

టెక్కలి: అన్ని రకాల భూమిపత్రాలతో సాగు చేస్తున్న భూములను ఇప్పటికిప్పుడు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేసి తమను అన్యాయం చేస్తున్నారని కోటబొమ్మాళి మండలం పెద్దబమ్మిడి గ్రామానికి చెందిన దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో అధికారులు తమను ఇబ్బందులు గురి చేస్తున్నారని వాపోయారు. వివరాల్లోకి వెళితే.. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పెద్దబమ్మిడి సర్పంచ్ మెండ తాతయ్య సహకారంతో గ్రామంలోని పోరంబోకు భూమిని సుమారు 38 మంది నిరుపేద దళితులకు ఒక్కొక్కరికి 26 సెంట్లు చొప్పున కేటాయించారు. భూ పట్టాలతో పాటు పాస్ పుస్తకాలు, ఇతర భూపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకం, ఇటీవల అన్నదాత సుఖీభవ పథకం కూడా వర్తింపజేశారు. ప్రస్తుతం ఆయా భూముల్లో వ్యవసాయం, ఇతర పంటలను పండిస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా శుక్రవారం రాత్రి సమయంలో రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేయడంతో దళితులంతా ఆందోళన చెందుతున్నారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం...

కొంత మంది కూటమి నాయకుల ఒత్తిడితో మా భూముల్లో అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. దశాబ్దాలుగా అన్ని రకాల పత్రాలతో సాగు చేస్తున్నాం. మాకు జరిగిన అన్యాయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.

–తోట వెంకటరమణ, బాధితుడు

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అప్పారావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరావు ఆదేశాల మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన బూర్ల అప్పారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు.